# స్నేహితులు

రికార్డింగ్ స్టూడియోనుంచి బైటపడి, లిఫ్ట్‌లో కిందికి దిగి, రోడ్డు మీద అడుగుపెట్టిన మాధవి 'ఢిల్లీచలి ఎంత అందమైందో ఢిల్లీఎండ అంత భయంకరమైంది' అని ఈ నిప్పులుచెరిగే ఎండ నుంచి ఎట్లా తప్పించుకోవటమా అని నిస్సహాయంగా సూరి ముఖంలోకి చూసింది. చల్లని ఎయిర్‌కండిషన్ రికార్డింగ్ స్టూడియోనుంచి బైటికివచ్చేసరికి మంటల్లో అడుగు పెట్టినట్టయింది. రెణుకెలో రికార్డింగ్ త్వరగా ముగించుకుందామని ముందుగా పదిగంటలకే వాళ్లు వచ్చినప్పటికీ, తెలుగుఅనువాదం పని అక్కడికక్కడే చెయ్యవలసిన జాప్యంవల్ల క్యూలో వెనకపడ్డారు. అప్పటికే తమిళ, మలయాళ, కన్నడ, మరాఠీ, గుజరాతీ, ఒరియా జట్లు సిద్ధంగాఉన్నారు. తమ రికార్డింగ్ పూర్తయ్యేసరికి ఒంటి గంటన్నరయింది.

లంచ్‌కి ఎటుపోవాలో తేల్చుకోలేక నడుచుకుంటూ జనపథ్‌లో కాటేజ్ ఇండస్ట్రీస్ వరకూ వచ్చాక మాధవి 'బంకూరాలో తిని చాలా రోజులయింది' అంది. బంకూరాలో లంచ్ మాధవికి ఇష్టం. మామూలుగా అయితే ఆఫీస్ కేంటీన్‌లోనో లేదా దగ్గర్లో ఉన్న యుఎన్ఐ కేంటీన్‌లోనో లంచ్‌తో సరిపుచ్చుకునే సూరికి దాదాపు రెండు నెలల తర్వాత మాధవి దొరకటంతో, ఆ రోజు మంచిహోటల్‌లో తీరిగ్గా కబుర్లుచెప్పుకుంటూ లంచ్ చేయాలనిపించింది. ఆ రోజు వాళ్లు మూడు రేడియో స్పాట్‌లు చేశారు. సూరికి మూడు స్పాట్‌లకు చెక్ అందింది. ఆ మొత్తాన్ని ఆ పూట మాధవి కోసం ఖర్చు చేయాలని పించింది. పైగా మాధవితో పని పడింది. శివాజీ కళ్లనీళ్లు రాత్రి తన గుండెలో పడి శివాజీకి సహాయపడాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

'నేను చెప్పా చెయ్యక వెళ్లిపోయినందువల్ల మీకేం ఇబ్బంది కాలేదుకదా. అమ్మకి ఆరోగ్యం బాగాలేదని అక్క టెలిగ్రామ్ రాత్రి అంది తెల్లారే బయల్దేరాను. రైలు ఢిల్లీ పొలిమేరలు దాటిపోయిన తర్వాత అన్పించింది మీకు ఓ కార్డు రాసి

పడేయాల్సిందని.' అట్లా మాధవి ఈ రెండు నెలలు తను ఢిల్లీలో లేకుండా పోయినందుకు కారణాలు చెప్పింది. ఈ మధ్య కాలంలో తన అనుభవాలనీ, తెలిసిన ముచ్చట్లనీ చెప్పడం మొదలుపెట్టింది. గుంటూరులో తమ బంధువుల ఇంట్లో గాయకుడు ఏసుదాసును చూసిందట. ఆయన పాటలు విన్నదట. ఢిల్లీలో తన స్నేహితులు బనశ్రీ జయరామారావులు వచ్చేనెల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చేందుకు సాంస్కృతిక బృందంతో తూర్పుయూరప్ దేశాల పర్యటనకు వెడుతున్నారట. ఆర్ట్‌హెరిటేజ్‌లో లక్ష్మాగౌడ్ చిత్రకళాప్రదర్శన చూసిందట! ప్రకృతితో తాదాత్మ్యం పొందే తెలంగాణా గ్రామీణ జీవితంలోని అందాలతో ముగ్ధురాలయి పోయిందట. లక్ష్మాతో మాట్లాడిందట! శివకుమార్ పశ్చిమజర్మనీలో స్థిరపడేందుకు రాజీపడి జర్మన్ భార్యదగ్గరకు వెళ్లిపోయాడట. వెస్ట్ నిజాముద్దీన్‌లో ఓ స్నేహితుని ఇంట్లో పార్టీలో ఎమ్.ఎఫ్. హుస్సేన్‌ని చూసిందట.

మాధవి తెలివైంది. తన వ్యక్తిగత విషయాలు ఎక్కడా దొర్లకుండా ఎన్ని కబుర్లన్నా ఎంతసేపన్నా చెప్పగలదు. సూరికి ఆ తెలివితేటలు ఎంతో ఇష్టం. మాధవిని అందుకే అభిమానిస్తాడు.

బంకూరాలో ఖాళీ టేబుల్ ఏదీ కన్పించలేదు. దాదాపు మధ్యాహ్నం రెండున్నర గంటలు కావస్తున్నా లంచ్ రష్ ఇంకా సాగుతూనే ఉంది. కనీసం ఖాళీగా ఉన్న రెండుకుర్చీలు ఎక్కడా తన దృష్టిలో పడలేదు. లంచ్ ముగింపు దశలో ఉన్నవాళ్లనూ, బిల్ చెల్లించే దశలో ఉన్నవాళ్లనూ వెతుక్కుంటూ ఓ రౌండ్ తిరిగాడు సూరి. తమకు మల్లే మరో నలుగురు ఆడపిల్లలు ఖాళీ టేబుల్ కోసం వెతుకుతున్నారు. ఢిల్లీలో సంపన్న కుటుంబాలకు చెందిన వాళ్లలా ఉన్నారు వాళ్లు .

ఆ మూల టేబుల్ ఖాళీ అవుతుండగా దగ్గర్లోనే ఉన్న ఆ నలుగురు అమ్మాయిలు దాన్ని ఆక్రమించుకున్నారు. మరో రెండు జంటలు లోపలికి ప్రవేశించాయి. వాళ్ల వేషాలు చూస్తుంటే బంకూరా అట్లాంటివాళ్ల కోసమే అన్నట్టుంది.

ఐస్‌క్రీమ్ తింటున్న ఓ టేబుల్ ఖాళీ అయింది. అక్కడే నుంచున్న మాధవి ఆ టేబుల్‌ని కొత్తగా వచ్చిన ఆ రెండు జంటలకి విడిచిపెట్టేసింది. మరీ ఎంట్రెన్స్‌లో కూర్చోవడం మాధవికి ఇష్టం ఉండదు. ఇద్దరే కూర్చునే టేబుల్ కోసం వెతుకుతున్నది.

బంకూరాలో తిండి రుచికన్నా అక్కడి వాతావరణం గొప్ప ఆకర్షణ. కాటేజ్ ఇండస్ట్రీస్ పేరుకు తగ్గట్టుగా చేతిపని వస్తువులతో, గ్రామీణ పరిసర వాతావరణంతో

ఆ రెస్టారెంట్ రూపురేఖల్ని తీర్చిదిద్దినట్టు కళాత్మకంగా అలంకరించారు. కేన్ బుట్టలు, సన్నటి వెదురుబద్దలతో అల్లిన అందమైన ట్రేలు, నిండా తొట్లలో పచ్చటి మొక్కలు, మట్టి ఏష్‌ట్రేలు, బంకూరా టెర్రకోటా బొమ్మలు, రాజస్థానీ వస్త్రతోరణాలంకారాలు, పిచ్చిగా అడవిమల్లె పెంచిన లతలూ, పూలూ. ఆ వాతావరణం పల్లె ప్రాంతాలలోకి తీసుకు పోతుంది. విదేశీ పర్యాటకుల్లా కనిపిస్తున్న తెల్లదొరల జంట మాధవికి ఇష్టమైన ఇద్దరు కూర్చునే మారుమూల టేబుల్‌ని ఖాళీ చేశారు. తను వెంటనే సీట్‌లో కూర్చుని, మరో మూల టేబుల్ కోసం వెతుకుతున్న సూరిని పిలిచింది మాధవి.

"కిందటిసారి ఇక్కడే మనం కూర్చున్నాం" సరదా పడిపోయింది మాధవి.

"నీ కోసం బంకూరా మేనేజ్‌మెంట్‌వాళ్లు దీన్ని రిజర్వ్ చేసినట్టున్నారు" అన్నాడు టేబుల్‌ని సమీపిస్తూ సూరి.

మాధవిలో వారసత్వంగా వచ్చిన రాజసం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. బంకూరాలో ఉన్న స్త్రీ పురుషుల చూపులు చాలా సహజంగా మాధవి ఆకర్షణలో చిక్కుకోవటం సూరి గమనించాడు. తెనాలి దగ్గర ఓ పల్లెటూరు తెలుగమ్మాయి పాదాల ముందు ఢిల్లీ జనం మోకరిల్లే దృశ్యం సూరికి గర్వంగా ఉంటుంది. మాధవి అందాలలో ఒకపాలు శృంగారం ఎక్కువ కావటంవల్ల ఆమె చూపులు నీలం ఆకాశం కిందికి తీసుకుపోతాయి. ఆమె సమీపంలో ఉంటే చాలు వనదేవత ప్రత్యక్షమయినట్టు ఉంటుంది. మాధవి తన పరిసరాలను పట్టించుకోదు. చుట్టూ ఉన్న మనుషులను చూడటం, తనను కొలుస్తున్న మగహృదయాలను రెచ్చగొట్టటంవంటి వేషాలు ఆమెలో కన్పించవు. మెనూ చూసి లంచ్ తనే ఎంపిక చేసింది. టొమేటో సూప్, వెజిటేబుల్ సలాడ్, పాలక్‌పనీర్, ఫిష్‌ఫ్రై, రోటీసుఖా.

"ఓకే. ఐస్‌క్రీమ్ బైట నెరూలాలో తీసుకుందాం. సరేనా?"

"సరే" అంది మాధవి.

"నువ్వు లేనందువల్ల ఈసారి బాగా ఇబ్బందయింది. మార్చిలో దాదాపు ఏడెనిమిది రోజులు సెలవు పెట్టాల్సి వచ్చింది. పద్మావతి, కౌసల్య ఇదివరకు స్పాట్స్ చేసినవాళ్లే. కాని ఇప్పుడు వాళ్లు పెద్ద హోదాల్లో ఉన్న అధికారులు. వాళ్లకు కొన్నిసార్లు కుదరదు. పైగా రికార్డింగ్ స్టూడియోల్లో జాప్యం. తప్పనిసరిఅయి వాళ్లను ఇబ్బంది పెట్టవలసి వచ్చింది."

వాళ్లతో ఇదివరలో ఇబ్బంది మూలంగానే సూరి మాధవిని ప్రమోట్ చేశాడు. ఈసారి మాధవి లేని రోజుల్లో గాయత్రి, స్నేహలత దొరికారు. ఇద్దరూ జె.ఎన్.యు.

విద్యార్థినులే. స్నేహలత బాగా రాణించేట్టు కన్పించింది.

"నువ్వు లేని రోజుల్లో కనీసం అరడజనుసార్లు మీ హాస్టల్‌కి వచ్చాను. నువ్వు వచ్చి ఉండవచ్చులే అన్న ఆశతో. నీ స్నేహితురాలు, ఆ కాశ్మీరీ అమ్మాయి ఒకసారి బ్రిటిష్ లైబ్రరీలో కన్పించి నువ్వు ఊళ్లో లేవని చెప్పిందే తప్ప ఎక్కడకు వెళ్లిందీ చెప్పలేదు. శివాజీని అడిగితే తనకు తెలీదన్నాడు. రాహుల్‌ని అడిగితే నువ్వు ఊళ్లో లేవన్న సంగతి కూడా తనకు తెలీదన్నాడు."

"తిరిగి వచ్చిన వెంటనే ఓ ఫ్రెండ్‌తో కలకత్తా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ దాదాపు మూడు వారాలు ఉండిపోవలసివచ్చింది" అంది మాధవి.

"చివరికి శరత్‌బాబు నిన్ను కలకత్తా పిలిపించుకున్నాడన్నమాట!"

ఆ మాట అన్నప్పుడు భట్టాచార్య గురించి స్నేహితులద్వారా సూరికి తెలిసిందా అన్న అనుమానం కలిగింది మాధవికి.

"శరత్ బాబు ప్రభావం తెలుగువాళ్ల మీద ఎట్లాంటిదంటే, ఒకప్పుడు శాంతినికేతన్‌లో చదువుకోవాలని, మీ నాన్నగారిలాగా బెంగాలీ భాష నేర్చుకుని ఆ సాహిత్యం చదువుకోవాలనీ ఉండేది..." అని ఇంకా సూరి చెప్పబోతూ ఉంటే—

"మా నాన్నగారి సంగతి వేరే లెండి. ఆయన ఇంట్లో ఎదురు తిరిగి పారిపోయి సుభాష్ బాబు ఆజాద్‌హింద్ ఫౌజ్‌లో చేరాలనుకుని కలకత్తాలో మునిగి చివరికి శాంతినికేతన్‌లో తేలాడు"

"సంగతి చెప్తున్నాను. అప్పట్లో అట్లా ఉండేది. ఇప్పుడా బెంగాలీ అమ్మాయిలని పెళ్లి చేసుకోవాలని కలలు గంటారు. అమ్మాయిలయితే బెంగాలీ యువకుల కోసం"—

"చాల్లెండి. బెంగాలీ అబ్బాయిలను పెళ్లిచేసుకోకూడదా? మీరేమో వసుధైక కుటుంబవాదులు కదా! ఈ జాతి దురభిమానపు బుద్ధులేమిటి? అయినా ఉద్యోగప్రయత్నాల మీద కలకత్తా వెళ్లేనని ఎందుకనుకోకూడదు?" అంది మాధవి.

పక్క టేబుల్‌లో ఓ బెంగాలీ కుటుంబం. ఇద్దరు వయసులో ఉన్న పెళ్లికాని అమ్మాయిలు, తల్లీ తండ్రీ — అమ్మాయిలు ఇద్దరూ తల్లిపోలిక. పెద్దకండ్లతో దేవీముఖాలు. వేరే భాషలో బెంగాలీ పదం, శరత్‌బాబు పేరు, కలకత్తా, సుభాష్‌బాబు మొదలయిన మాటలు వినటంతో వాళ్లు తమని పరిశీలించి చూడటం గమనించాడు సూరి. కలకత్తాలో లాలాలజ్‌పత్‌రాయ్ రోడ్డులో నేతాజీ భవన్‌ని చూసిందట. వాళ్లమ్మ నేతాజీ భక్తురాలట. నేతాజీ భవన్ చూసిన సంగతి తల్లికి రాస్తే తల్లి ఎంతో

సంతోషపడిపోయిందట. బెంగాలీ కుటుంబజీవితంలోని సాంప్రదాయిక విలువలు గురించీ, బెంగాలీ సాహిత్యం గురించీ, రబీంద్రసంగీత్ గురించీ మాధవి చెబుతుండగా బేరర్ రెండు బౌల్స్‌లో టొమోటో సూప్ తెచ్చి పెట్టి వెళ్లిపోయాడు. సూప్‌లో తగు మాత్రం పెప్పర్, సాల్ట్ చల్లుకుని "నీ కలకత్తా ఫ్రెండ్ చేపకూర తినిపించినట్టేనా?" అని అడిగాడు సూరి.

తిండి, పిండివంటలు, రుచులు సూరికి ప్రత్యేకమైన అభిమాన విషయాలు.

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని తెలుగు పిల్లలు ఉగాది సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేడుకల కార్యక్రమాలలో మాధవితో సూరికి తొలి పరిచయం. ఢిల్లీ తెలుగువాళ్లు, తమతమ కాలనీలలో, సంస్థలలో, అసోసియేషన్‌లలో ఉత్సాహంగా జరుపుకునే పండుగల్లో ఉగాది ఒకటి. చెదురు మదురుగా ఉన్న తెలుగు కుటుంబాలు ఎక్కడో ఓ చోట ఈ ఉగాది వేడుకల్లో కలుస్తారు. కేంద్రప్రభుత్వపు సెలవుదినాల్లో తెలుగు ఉగాది లేనందువల్ల ఢిల్లీలో ఆ రోజు ఆఫీసులకు సెలవు ఉండదు. ఆ సరికి ఢిల్లీ వేపచెట్లకు పూలు కూడా ఉండవు. వేపపూవులేని ఉగాది ఏమిటనుకునే వాళ్లు ఉత్తరాలు రాసి తెలుగుదేశం నుంచి వేప పూవు తెప్పించుకుంటారు. కూచిపూడి నృత్య కళాకారుడు, తన మిత్రుడు జయంత్‌తో సూరి జె.ఎన్‌యు.లో ఆ ఉత్సవాలకు హాజరయినప్పుడు మాధవి జానపద నృత్యకార్యక్రమం సూరిని బాగా ఆకర్షించింది. ఆమె గొంతులో ఉన్న నిండుతనం పసిగట్టిన సూరి, తర్వాత ఆమెని కలుసుకున్నప్పుడు, రేడియోలో వాణిజ్య ప్రకటనలు గురించి ఆమెకు చెప్పి, తనకు తరచుగా ఫిమేల్ వాయిస్ అవసరం పడుతుందని చెప్పాడు. మాధవి సరదా పడింది. రేడియో ప్రకటనలు ఉత్సాహం కలిగించాయి. దానికితోడు పారితోషికం ముడుతుంది. ఢిల్లీలోని వివిధ రికార్డింగ్ స్టూడియోల్లో భారతీయ భాషలకు చెందిన అనేకమందితో ఆమెకి సూరి ద్వారా పరిచయం కలిగింది. మాధవి నమ్మదగిన ఆర్టిస్ట్. ముందు చెబితే చాలు. ఎన్ని అవాంతరాలున్నా సరే సకాలంలో రికార్డింగ్ స్టూడియోకి చేరిపోయేది. సూరి చెక్కులు ఆమెకు స్వయంగా అందజేసేవాడు. మాధవికి సూరి పెద్దమనిషితరహా నచ్చి చనువు ఏర్పడింది. తెలుగు భోజనం కోసం మొహం వాచిపోయినప్పుడల్లా సూరి ఇంటికి వెళ్లి తనకు కావలసినవి సూరి భార్య సరోజినిని అడిగి, చేయించుకుని, కొన్నిసార్లు తనే వండి, ఆ పూట వాళ్లతో గడిపి, తెలుగు పాటలు పాడుకుని వచ్చేది. వయసులో సూరి కన్నా దాదాపు ఇరవైయేళ్లు చిన్నదయిన మాధవి 'నువ్వు' అన్న సూరి ఏకవచన

సంబోధనకు సంతోషపడింది. మాధవి ద్వారా సూరికి జె.ఎన్.యు.లో చాలామంది తెలుగు పిల్లలతో స్నేహమయింది.

శివాజీ, రాహుల్, ఆనందరావు, ముస్తాఫా అట్లాంటి స్నేహితులే.

ఫ్రెండ్‌తో తాను కలకత్తా వెళ్లినట్టు చెప్పి, ఇంగ్లీషు మాట ముసుగున, స్నేహితుడో, స్నేహితురాలో తెలీకుండా దాచిపెట్టగలిగింది మాధవి. రాత్రి శివాజీ చెప్పటం వల్ల సూరికి ముందే తెలిసింది, మాధవి బెంగాలీ స్నేహితుడితో తిరుగుతున్నదని, అతడితోనే కలకత్తా వెళ్లిందని.

శివాజీ ఆ మాట చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నాడు.

హిస్టరీలో పి.హెచ్.డి చేస్తున్న మాధవి పరిచయమైన కొత్తలోనే శివాజీని పెళ్లి చేసుకోబోతున్నట్టు సూరికి స్వయంగా చెప్పింది. గత ఆరేడు మాసాలుగా ఆమె శివాజీతో కలిసి కనిపించటంలేదు సరికదా శివాజీ పేరు కూడా ఆమె నోట వినిపించటంలేదు.

ఇప్పుడు ఆ ప్రసక్తి తీసుకురావాలని సూరి తలంపు. మాధవి వసపిట్టలా మాట్లాడుతుందే తప్ప స్వంతవిషయాల పరిధిలోకి రాదు. 'భూమిక'లో స్మితాపాటిల్ నటన గురించి ఇంతసేపూ పొగిడింది. జోగారావు స్టేట్స్ వెడుతున్న సంగతి చెప్పి విదేశాలలో ఉద్యోగాలమోజు మనస్తత్వాన్ని ఈసడించింది. మధ్యమధ్య భారతీయ వేషభాషల ఔన్నత్యం గురించి జాతీయాభిమానంతో మాట్లాడింది. ఈవేళ మాధవి చీరెకట్టులో బెంగాలీ పద్ధతి కన్పించింది. సింధూరం అంచు లేతపసుపుపచ్చ నూలుచీరె కూడా కలకత్తాలో కొనుక్కున్నదిలా ఉంది. శివాజీ బాధ ఇప్పుడు సూరికి తెలుస్తున్నది.

శివాజీ రాత్రి ఇంటికి వచ్చిన సంగతి సూరి చెప్పాడు.

"శివాజీ, మాధవీ ఇదివరకటిలా కలిసిరావటంలేదని సరోజిని సందేహం" అన్నాడు సూరి.

"ఆ సందేహం శివాజీ ముందు పెట్టలేదా సరోజినిగారు?"

"అడిగింది. ఇది వరకటి మాధవికాదు, చాలా మారిపోయిందిప్పుడు, డాక్టర్ కాబోతున్నది కదా అన్నాడు శివాజీ."

"మాధవి ఎందుకు మారిపోయిందో చెప్పలేదా శివాజీ?"

"మాధవి మారినట్టు నాకేం అనిపించలేదు అన్నాను శివాజీతో" అన్నాడు సూరి.

ఇంకో పక్క టేబుల్‌లో జాపనీస్ టూరిస్ట్ యువతులు కాలిక్యులేటర్ మీద బిల్లు

లెక్కకట్టుకుంటున్నారు. యెన్‌లు రూపాయల మార్పిడి లెక్క కాబోలు.

వాళ్లను చూసుకుంటూ మౌనం వహించింది మాధవి. ఆమెకు ఎన్నో విషయాలు చెప్పాలని ఉంది. చెప్పకూడదు అని కూడా ఉంది. చాలా సేపటి తర్వాత వసపిట్ట నోరుతెరిచింది.

"మీకు భగవంతుడంటే నమ్మకం లేదు. నాకు ఎంతో గట్టి నమ్మకం. భగవంతుడు నాకు పెద్ద మేలు చేశాడు. సకాలంలో నన్ను మహాప్రమాదంలో కూరుకుపోకుండా కాపాడాడు. శివాజీ గురించి మీకు ఒకే ఒక్క మాటలో చెప్పాలని ఉంది. శివాజీ తెలివైన అవకాశవాది. తెలివి తక్కువ అవకాశవాదులు ఇట్టే బట్టబయలవుతారు. శివాజీని ఎంతో సన్నిహితంగా ఎరిగినవాళ్లు తప్ప పట్టుకోలేరు."

"నీ కొత్త స్నేహితుడు అవకాశవాదికాదన్న రుజువు ఏమిటి."

"నా కొత్త స్నేహితుడు గురించి కూడా శివాజీ మీతో చెప్పినట్టున్నాడు. నిజానికి యూనివర్సిటీలో శివాజీ నా కన్న సీనియరే అయినప్పటికీ కాంపస్‌లో నా తొలి మిత్రుడు భట్టాచార్యనే. భట్టాచార్య ద్వారానే శివాజీతో నా తొలి పరిచయం. శివాజీ తెలివైనవాడు కావటం వల్ల త్వరగానే తన ఆకర్షణ వలయంలో నన్ను బంధించగలిగాడు. ఆ రోజుల్లో అతడంటే ఎంతగౌరవం! పడిచచ్చేదాన్ని. శివాజీ పట్టుకోమన్న జెండాలని, ప్లేకార్డులని పట్టుకుని స్టూడెంట్ యూనియన్ రాజకీయాల్లో పనిచేశాను. శివాజీని పెళ్లి చేసుకోబోతున్నట్లు అందరికీ విజయగర్వంతో చెప్పుకున్నాను. ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను"

"నీ కొత్త నిర్ణయానికి కొంతకాలం తర్వాత ఇప్పటిలా పశ్చాత్తాప పడకుండా ఉంటే నాకు సంతోషం."

మాధవి తొందరపాటు కొత్త సమస్యలకు దారి తీస్తుందేమో అనిపించింది సూరికి.

సూరి గొంతులో ఆమె అవగాహన మీద అనుమానం.

"శివాజీ అంటే మీకు అంత అభిమానం అన్నమాట!"

"అవును. శివాజీ చాలా గొప్పవాడు. ఇంకా గొప్పవాడవుతాడు!"

"అవును. అవకాశవాదులంతా ప్రపంచం దృష్టిలో గొప్పవాళ్లే."

కొత్తస్నేహం మోజులోపడి మాధవి వాస్తవపరిస్థితిని అర్థం చేసుకోలేక తప్పు చేస్తున్నదని సూరి ఆవేదన. శివాజీ అంటే అతడి మిత్రుల్లో గుడ్డి అభిమానం, గౌరవం. ఆ సంగతి మాధవికి తెలుసు. అందుకే ఆమె శివాజీ గురించి విరుద్ధంగా

ఏమీ మాట్లాడలేదు. సూరి ఆ ప్రస్తావన లేవనెత్తినందువల్ల, ఆత్మవంచన చేతకాక, తన అభిప్రాయాలను స్పష్టం చేసింది.

రాహుల్, ముస్తాఫా, జంధ్యాల, ఆనందరావు, గాయత్రి, స్నేహలత అంతా శివాజీ అనుచరబృందమే — జె.ఎన్.యు. కేంపస్‌లో తెలుగు కీర్తిపతాకాన్ని శివాజీ ఎగురవేశాడు. అతడి ప్రసంగాల్లోని విప్లవపదజాలం, రాజకీయ చైతన్యం, స్టూడెంట్స్ యూనియన్ నిర్మాణ కార్యకలాపాల్లో అతడి చాణక్యం, వివిధ వర్గాల మధ్య మిత్రులతో అతడి సత్సంబంధాలు, అతడి వ్యక్తిత్వంలో ఆ ఆప్యాయతా స్వభావం, నమ్రత — వాటి ముందు మాధవి చెప్పే కారణాలు సందర్భరహితంగా, అల్పంగా, సత్యదూరంగా సూరికి తోచాయి. ఒక గొప్ప స్నేహితుడ్ని, అమూల్యమైన అతడి ప్రేమాభిమానాలని మాధవి కోల్పోతున్నదని సూరి బాధ. రాత్రి మాధవి కోసం శివాజీ మౌనంగా కార్చిన కన్నీళ్లు, మాధవి ప్రేమ కోసం శివాజీ పడుతున్న ఆవేదన ఉదయకాంతిలా స్వచ్ఛమైనవి. మాధవి నిదానంగా మంచిచెడులు ఆలోచించుకోవాలని, తొందర పడకూడదని సూరి ఆకాంక్ష.

బేరర్ ఖాళీ అయిన సూప్ బౌల్స్ తీసేసి ఆర్డర్ ఇచ్చినవి అరడజను ప్లేట్లలో తెచ్చిపెట్టి గ్లాసుల్లో చల్లని నీళ్లు నింపి వెళ్లాడు.

"భట్టాచార్యతోనే మీకు పరిచయం ఉంటేనో"—

తనకు ఏమీ తెలియని భట్టాచార్య గురించి అంచనా వేయటం కూడా పొరపాటే అన్పించింది సూరికి. తన తొందరపాటు తెలుసుకుని సూరి 'మాధవీ, నీవి తొందరపాటు నిర్ణయాలని నేను అనుకోవటంలేదు...' అని ఇంకా నచ్చచెప్పబోతుంటే మాధవి అందుకుంది.

"భట్టాచార్య నన్ను కలకత్తా తీసుకువెళ్లి, తన తల్లిదండ్రులకీ, అక్కలకీ, తమ్ముళ్లకీ, వాళ్ల బంధువులకీ పరిచయం చేశాడు. వాళ్లు నన్నెంత ప్రేమతో చూశారో! భట్టాచార్య సంస్కారం ఒక గొప్పవారసత్వం నుంచి వచ్చిందని అక్కడ నాకు తెలిసింది. అది ఎంతో సహజంగా, కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. భట్టాచార్య మాటలో, చేతలో, మనసులో, ప్రవర్తనలో, చుట్టూ ఉన్న పరిసరాలలో ఒక గొప్ప సంస్కారం!. భట్టాచార్య శివాజీ లాగా సంపన్నుడు కాదు. మధ్య తరగతి కుటుంబం. కలకత్తాలో ఒక అపార్ట్‌మెంట్‌లో వాళ్లు ఉంటున్నారు. భట్టాచార్య తండ్రి హైస్కూల్ టీచర్‌గా రిటైరయ్యారు. ఇప్పుడు వాళ్లు ఉంటున్న అపార్ట్‌మెంట్ వాళ్ల పెద్దక్క కొనుక్కున్నది. ఆమె బేంక్ ఆఫీసర్. పెళ్లి చేసుకోలేదు. మరి శివాజీ పరిస్థితి అదికాదు. అతడికి

రైలుప్రయాణాలంటే ఏమిటో తెలీదు. విమానాల స్థాయి. తన తల్లిదండ్రులు తరచు ఢిల్లీ వస్తారు. వచ్చినప్పుడు వాళ్లు తమబంధువు కేంద్రకేబినెట్‌మంత్రిగారి బంగ్లాలో ఉంటారు. లేదూ అంటే తాజ్‌పేలెస్‌లోనో, మౌర్యాషెరిటన్‌లోనో, హోటల్ ఒబ్రాయ్‌లోనో ఉంటారు. తన తల్లిదండ్రులకు నన్ను పరిచయం చేయటానికి భయపడిపోయాడు శివాజీ. పిరికివాళ్లంటే నాకు అసహ్యం. అది నా అనుభవంలో తెలిసివచ్చిన తర్వాత శివాజీ అంటే నాలో సందేహం ఏర్పడింది."

పక్క టేబుల్ బెంగాలీ కుటుంబం లేచింది. జుత్తు బాగా నెరసిపోయి సత్యజిత్‌రాయ్‌లా పొడవుగా ఉన్న ఆ బెంగాలీ ఆయన సూరి దగ్గరకు వచ్చి "మీరు తెలుగువాళ్లా?" అని స్పష్టమైన తెలుగు ఉచ్చారణతో అడిగాడు.

సూరి, మాధవి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్లని బెంగాలీ వాళ్లు అనుకున్నందుకు షాక్ తిన్నారు. ఢిల్లీలో ఈ వేషభాషలు అర్థం కావు. తన కొలీగ్ అసిస్టెంట్ ఎడిటర్ జానకి పంజాబీ దుస్తుల్లో వస్తుంది. డి.ఎ.వి.పి.లో అడుగుపెట్టిన కొత్తవాళ్లు ఆమె తమిళంలో మాట్లాడితే విని షాక్ తింటారు.

ఆ నలుగురిలో చిన్నమ్మాయి తెలుగులో తనని పరిచయం చేసుకుంది. తార, అక్క పేరు భానుమతి, తల్లిపేరు మధుమతి, తండ్రి ఆనందశంకర్ మజుందార్.

అయితే వాళ్లు బెంగాలీలే నన్నమాట!

సూరికి చాలా సంతోషంగా ఉంది. మజుందార్ నోట్లో తెలుగు భాషకి కొత్త అందం వచ్చింది. సూరికి గర్వంగా ఉంది.

"మాది విశాఖపట్నం" అంది అడక్కుండానే ఆ చిన్నమ్మాయి తార.

"విశాఖపట్నం మాది" అన్నట్టు ధ్వనించింది సూరికి. విశాఖపట్నం మాట చెవిలో పడేసరికి ఉప్పొంగిపోయింది మనస్సు. బంకూరాలో ఆ బెంగాలీ కుటుంబం ఇదివరకే బిల్లు చెల్లించి లేచిపోయారు కాబట్టి సరిపోయింది కాని, లేకుంటే విశాఖపట్నం పేరు పలికినందుకే సూరి ఆ బిల్లు తానే చెల్లించేవాడు.

"మీ ఊరే" అని సూరి ముఖంలోకి చూసింది మాధవి.

"అయితే ఈ ఊళ్లో ఎక్కడుంటున్నారు? ఎన్నాళ్లుంటారు? ఓ పూట మీ కుటుంబం మా ఇంటికి భోజనానికి రావాలి. మిమ్మల్ని తీసుకురాకపోతే మా ఆవిడ కోప్పడుతుంది" అని ముందు ఆహ్వానం ప్రకటించాడు సూరి. ఇద్దరూ ఢిల్లీలో చిరునామాలు చెప్పుకున్నారు.

మజుందార్ తమ్ముడు ఢిల్లీలో మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్‌లో ఉన్నత పదవిలో

ఉన్నాడట! ఈస్ట్ ఆఫ్ కైలాస్‌లో స్వంత భవనం ఉందట. సెలవుల్లో చూట్టానికి వచ్చి ఈ మండుటెండల్లో చిక్కుకుపోయారట. నిన్న సిటీటూర్‌లో వాళ్ల చిన్నమ్మాయికి రాజ్‌ఘాట్ దగ్గర ముక్కునుంచి నెత్తురు పడిందట! ఈ ఎండలు వాళ్లకి అలవాటు లేవట.

"విశాఖపట్నం హాయిగా చల్లగా ప్రశాంతంగా ఉంటుంది. దానికితోడు మేము సముద్రం ఒడ్డున లాసన్స్‌బే కాలనీలో ఉంటున్నాము. ఈ హోటల్‌లో చెవికింపుగా తెలుగు విన్పిస్తుంటే విశాఖపట్టణంలోనే ఉన్నట్టు అన్పించి మిమ్మల్ని పలకరించాలనుకున్నాను" అని మజుందార్ ఆ ఇద్దరి పేర్లను అడిగి తెలుసుకున్నాడు.

"అయితే మాధవీ భట్టాచార్య అవుతున్నావన్నమాట!" అని హర్షం ప్రకటించాడు మజుందార్. సూరి వేపు చూసి "ఈసారి మీరు విశాఖ వచ్చినప్పుడు మా ఇంటికి తప్పక రావాలి" అని తన గోధుమరంగు లాల్చీ జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి సూరికి ఇచ్చాడు.

"ఈస్ట్ ఆఫ్ కైలాస్‌కి దగ్గర్లోనే ఉంటున్నాం. లాజ్‌పత్‌నగర్ ఫోర్. తప్పక రావాలి" అని వీడ్కోలుతో మరొకసారి తన ఆహ్వానాన్ని మజుందార్ కుటుంబానికి గుర్తు చేశాడు సూరి.

ముగ్గురు యూరోపియన్ మహిళలు చీరె, బొట్టు, గాజుల వేషంలో లోపలికి వచ్చారు. వాళ్లతో ఉన్న మగవాళ్లు పంచెకట్టుతో, తలపాగాలతో, పాతకాలపు అంగీలతో అచ్చం ఉత్తరాది పేదరైతుల్లా ఉన్నారు. కళ్లార్పకుండా వాళ్లను చూస్తున్న సూరికి మరింత వింతదృశ్యం కనిపించింది.

మగవాళ్లు హరేకృష్ణ కాషాయ దుస్తులతో, మెడలో తులసి పూసలతో, గుండూ పిలకలతో, స్త్రీలు వేలాడిన జుత్తుతో, పాదాలకు ఆకుచెప్పులతో వచ్చి ఖాళీ అవుతున్న తమ టేబుల్ దగ్గర నుంచున్నారు. బేరర్ తెచ్చే చిల్లర కోసం ఎదురు చూస్తున్న సూరీ, మాధవీ లేచి నుంచుని వాళ్లని కూర్చోమన్నారు.

అక్కడ ఆ చిన్న బంకూరాలో ప్రపంచ సంస్కృతులన్నీ సమావేశమైనట్టు సూరికి తోచింది.

"అయితే మీ అమ్మగారి సమస్య పరిష్కారమైందన్నమాట" అన్నాడు సూరి. శివాజీతో పెళ్లి మాధవి తల్లిదండ్రులకు ఇష్టంలేదనీ, అయినా సరే తాను ఎదురుతిరిగి శివాజీని చేసుకోవాలనుకుంటున్నాననీ ఒకప్పుడు మాధవి చెప్పింది. ఇప్పుడు ఈ భాషాంతర వివాహానికి తల్లిదండ్రుల సమ్మతి ఉంటుందా అన్న ఉద్దేశంతో సూరి ఆ

మాట అన్నాడు.

"మా నాన్న శాంతినికేతన్ విద్యార్థి. మా అమ్మ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ భక్తురాలు. వాళ్ల సమ్మతి సమస్య కాదనుకుంటాను. ఎటొచ్చీ భట్టాచార్య సమ్మతే కావాలి."

సూరి ఆశ్చర్యంలో మునిగిపోకముందే మాధవే చెప్పింది.

"ఇప్పుడు మేము కేవలం స్నేహితులమే"

"మరి కలకత్తా తీసుకువెళ్లి అక్కడ తమ వాళ్లకి నీ ఫ్రెండ్ ఏమని పరిచయం చేశాడు?"

"స్నేహితురాలు అనే"

సూరికి సందేహాలు, అనుమానాలు, భయాలు, ప్రశ్నలు అన్నీ కలగాపులగంగా ఎదురయి మాధవి ఆలోచనలు పిచ్చిపిచ్చిగా ఉన్నట్టు అన్పించసాగింది.

"పెళ్లి విషయం కనీసం మీ ఇద్దరన్నా అనుకున్నారా?"

"అనుకోలేదు."

"అంటే"

"అంతకన్నా ముఖ్యమైన విషయాలు మా అనుబంధాలని ధ్రువపరచి పటిష్ఠం చేశాయి."

జనపథ్‌లో పిచ్చిగా పరుగులు తీస్తున్న వాహనాలను, జనాన్ని సూరి పరధ్యానపు చూపుల్తో చూడటం గమనించి మాధవి—

"భట్టాచార్యను మీరు చూస్తే మీకీ సందేహాలు కలగనే కలగవు" అంది.

తర్వాత స్నేహలత చెప్పింది

పోస్ట్ డాక్టరేట్ స్కాలర్‌షిప్‌తో గాంధీయిజం మీద అధ్యయనం చేస్తున్న భట్టాచార్య పిచ్చివాడట. యూనివర్సిటీలో లెక్చరర్ ఉద్యోగం పిలిచి ఇస్తామంటే వద్దన్నాడట. తరచు పత్రికలకు ప్రపంచశాంతి మీద వ్యాసాలు రాస్తాడట. శరీరానికి జబ్బుచేస్తే ప్రకృతివైద్యం చేసుకుంటాడట. కొరాపుట్ కొండల్లో ఆదివాసీ గ్రామప్రాంతాలలో ఒక బడిపెట్టి, పిల్లలకు చదువు చెప్పి బతుకుతాడట! భట్టాచార్య ప్రభావంలో పడి మాధవి కూడా పిచ్చిదయిందట. అతడు చేయతలపెట్టిన సేవా కార్యక్రమంలో పాలుపంచుకోవటానికి ఈ తెలుగుపడుచు అతడికి కావాలట. జీన్స్‌లో ఉన్న స్నేహలత వాళ్లమీద జాలిపడుతూ —

"ప్రపంచ సంక్షోభాలకి గాంధీ ఇజమే పరిష్కారం అన్నది వాళ్ల సిద్ధాంతం" అని

ముగించింది.

సూరికి ఆ క్షణాన భయమయింది! అయితే భట్టాచార్యను కలవాలి అని మాత్రం గట్టిగా అనుకున్నాడు సూరి.

* * *

*ఈనాడు ఆదివారం 23-4-89*